# బూజు పట్టిన సంసారాలు

"జయలలి"



మా అక్కయ్యకు గాజులు పెట్టిస్తారని తెలిసి నప్పటినుంచీ నాకు సంతోషం ఎక్కువయింది. గాజులు మేము అన్నిసార్లు వేయించుకుంటూనే వున్నామే, మమ్మల్ని ఎవ్వరూ చెప్పుకోరు. కాని, అక్కయ్యకు గాజులు పెట్టించాలని మా యింటిల్లిపాదీ అంటే మా నాన్నా, అమ్మమ్మా, అన్నయ్యా, వదినా అంతా కలిసి మాట్లాడుకోడమూ, ఏవేవో ఏర్పాట్లు చేసుకుంటూండడమూ చూస్తే నాకు ఆశ్చర్యం కలిగింది. అయినా 'మేము గాజులు వేయించుకుంటాము. వీళ్ళేమో అక్కయ్యకు గాజులు పెట్టిసామంటున్నారు. ఇందులో ఏదో తేడా వుందని' గ్రహించి ఓరోజు మా అమ్మమ్మని అడిగేను. "అమ్మమ్మా, అమ్మమ్మా. అక్కయ్యకి గాజులు వేయించడమంటే ఇంత ఆర్భాటం చేస్తారేమిటి?" అన్నాను. అమ్మమ్మ నవ్వుతూ అందికదా, "ఇదివరకటిలాగ కాదమ్మా. ఈమాటు అక్కయ్యకు గాజులు చాలా పెడతారు" అని.

"ఐతే ఎన్ని?–ఓడజను గాజులు వేస్తారా" అన్నాను.

"అంతేకాదు. మోచేతులదాకా గాజులు తొడుగుతారు" అంది అమ్మమ్మ. నాకు నమ్మకం కలగలేదు.

"అబ్బో! మోచేతులదాకా వేస్తే అక్కయ్య యెలాగ మోస్తుంది? దాని తెల్లటిచేతులు కందిపోవా అమ్మమ్మా! మరి అన్నం యెలాగ తింటుంది" అన్నాను.

"వెర్రి తల్లీ, మొద్దువుగాని ఎలాగ మోస్తారో, నువ్వు తొడపెళ్ళికూతురివి. నీకూ వేస్తారు అన్ని గాజులు" అంది అమ్మమ్మ.

"నేనన్ని మొయ్యలేను బాబూ!" అన్నాను. అమ్మమ్మ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది వంటింట్లోకి. నేనలాగే ఆలోచిస్తూ నిలబడ్డాను.

మా అక్కయ్యకు గాజులుపెట్టించే రోజు వచ్చింది. మా అమ్మమ్మ తెల్లవారగట్ల నాలుగు గంటలకే అందర్నీ లేపేసింది. మా వదిన లేచి వీధి గుమ్మంకడిగి ముగ్గు పెట్టింది. నాన్న గుమ్మాలకు మామిడితోరణాలు కట్టడం మొదలుపెట్టేడు. మా అన్నయ్య తోటలోకి పరుగెత్తేడు పనసకాయలకు. అమ్మమ్మ మా అందరికీ తలంటి నీళ్ళుపోసింది. మా అందరికన్నా అక్కయ్యే ఆఖర్ని నీళ్ళు పోసుకుంది. ముఖంనిండా పసుపు రాసుకుంది. రూపాయకాసంత కుంకంబొట్టు పెట్టుకుంది. కొత్త చీర కట్టుకుంది. అమ్మమ్మ యెందుచేతనో అక్కయ్యను చూసి కంట తడి పెట్టుకుంది అన్నయ్య తిరిగి వచ్చి వదినని అడిగేడు.

"అమ్మమ్మ ఏడుస్తోందే" మని-"మీ అమ్మగారు జ్ఞాపకం వచ్చారట" అంది వదిన.

"ఊరుకో అమ్మమ్మా-శుభమల్లేను" అన్నాడు అన్నయ్య.

"నీకేం తెలుసు నాయనా! ఎవరి కడుపు బాధ వాళ్ళది" అని కళ్ళు తుడుచుకుంటూంది అమ్మమ్మ.

"శనగలు నానపోశా రర్రా" అన్నాడు నాన్న ఇంట్లోకి వస్తూ-అమ్మమ్మ వదినకేసి చూసింది.

"ఆ" అంది వదిన.

"ఐతే కొబ్బరికాయలెన్ని తీయమన్నారు" అన్నాడు అన్నయ్య ఆటగెక్కుతూ నిచ్చెన మెట్టుమీదనుంచి.

"ఓ పది తియ్యి. మిగిలితే ఏమవుతాయి" అన్నాడు నాన్న.

అక్కయ్య గదిలో కూచుని ఆలోచిస్తోంది చేతిలో ఒక ఉత్తరం పెట్టుకుని. అది మా బావ రాసినదేనని నీలికాగితాన్ని బట్టే గుర్తుపట్టేశాను.

"అక్కా! బావ ఎప్పుడు వస్తానన్నాడే" న్నాను కొంటెగా.

"నాకు తెలీదు" అంది అక్కయ్య.

"నిజం చెప్పవే. బావని చూడాలని వుంది" అన్నాను.

"ఎందుకు బావంటే అంత కులుకు" అంది.

"అంతా నీకే వుండాలా. నాకుంటే తప్పా" అన్నాను. అక్కయ్య నన్ను పట్టుకోబోయింది. నేను పెరట్లోకి పారిపోయేను. కొత్తచాపమీద అన్నయ్య పనసకాయపొట్టు కొడుతున్నాడు. ఆపొట్టుకు పసుపు, నూనె రాస్తున్నాడు. బంక తీసిన పుల్ల నా కాలికి తగులుతుంది. అది తీసి మా వదిన చేతికి అంటించేను. వదిన నవ్వుకుని దూరంగా పారేసింది.

ఇంతలో మా మామయ్య ఇంట్లోకి వస్తూ "ముహూర్తం సమీపిస్తోంది. అన్నీ సిద్ధంగా వున్నాయా" అన్నాడు. సావిట్లో తివాసీలు, చాపలు పరిచేరు. మా అక్కయ్యకు మాత్రం పేరే పీటవేశేరు. వీధి అరుగుమీద సన్నాయి మేళం 'తూ, తూ' అంటోంది. గాజులమల్లయ్య గుర్రంమీంచి దిగి, గుర్రాన్ని పందిరి స్తంభానికి కడుతున్నాడు. ముత్తయిదువలు పది మంది పోగయ్యారు. "అమ్మమ్మా! రామామణి రాలే దేమే" అన్నాను. "పేరంటాళ్లంతా సాయంత్రం వస్తారమ్మా" అంది అమ్మమ్మ.

సన్నాయి పాడుతున్నారు. బ్రాహ్మలు మంత్రాలు చదివి అక్కయ్యమీద అక్షింతలు చల్లుతున్నారు. మల్లయ్య గాజుల మలారం విప్పేడు. నాన్న ఓ ప్రక్కని కూర్చున్నాడు. నేనో ప్రక్క వున్నాను. అన్నయ్య వెనకాల నిలబడ్డాడు. వదిన గదిగుమ్మంలోంచే చూస్తోంది. అమ్మమ్మ మల్లయ్య దగ్గిరికి వచ్చి:

"బాబూ! ఇప్పుడు శాస్త్రానికి రకానికో గాజు వెయ్యి. అవక పేరంటాళ్లొచ్చేక అన్నీ వేద్దువుగాని" అంది. మల్లయ్య ఒక్కొక్క రకమే చూసుకుంటూ అక్కయ్య చేతులకు చెరో పది గాజులూ వేశేడు. నేను అమ్మమ్మ మొహం చూసేను. అమ్మమ్మ గ్రహించి "నాయనా దానిక్కూడా వెయ్యి. తోడపెళ్లి కూతురు" అంది. మల్లయ్య నవ్వి నాకూ వేసేడు ఈ చేతికో పదిగాజులూ, ఆ చేతికో పది గాజులూను. సన్నాయి ఆపేసేరు. ముందు గాజుల మలారానికీ, తర్వాత అక్కయ్యకూ హారతిచ్చేరు. అక్కయ్య లేచింది గాజుల మలారం కళ్ళకద్దుకుని.

మధ్యాహ్నం భోజనాలు చేశాం. ఒక్క నిముషమైనా కూర్చోలేదు. "ఇంట్లోవన్నీ నేను సర్దుకుంటాను. పేరంటాళ్ళని పిలిచి రండర్రా" అంది అమ్మమ్మ. నేనూ మా వదినా బయలుదేరాం. వదిన బెంగుళూరు సిల్కు చీర కట్టుకుంది. మా బావ తెచ్చిన కణంగుడ్డ జాకెట్టు, పరికిణీ నేను తొడుక్కున్నాను.

పేరంటాళ్ళను పిలిచి ఇంట్లో అడుగు పెట్టేమో లేదో మూడుగంటలు కొట్టేసేరు. మా అమ్మమ్మకంతా ఖంగారే. చావడిలో అంతా చాపలు, జంబుఖానాలు పరిచేసింది. అన్నయ్య మిగిలినవన్నీ సిద్ధంచేశాడు. అగరువత్తుల సెట్టు, దీపంకుందె, పన్నీరుబుడ్డీ, గంధంగిన్నె, అక్షింతల పళ్లెం అన్నీ వెండివే అమర్చిపెట్టేరు. అక్కయ్యకు మళ్ళీ పీట వేశారు. మల్లయ్య మళ్ళీ గుర్రం దిగేడు. పేరంటాళ్లు రావడం మొదలు పెట్టేరు. పది నిముషాలలో సావిడి అంతా నిండిపోయింది. రామామణి, సీతారత్నం వాళ్ళ అమ్మలతో కలిసివచ్చేరు. నాచేతి గాజులు చూసి నవ్వుకుంటున్నారు. వెర్రిపిల్లలు. వాళ్ళ అక్కయ్యలకి గాజులు పెట్టినప్పుడు, వాళ్ళకీ వేస్తారని తెలియదు కాబోలు! అయితేనేం ఆ మాట రేపు బళ్లో చెప్పవచ్చని ఊరుకున్నాను. అక్కయ్యవచ్చి కూర్చుంది. మల్లయ్య మళ్ళీ గాజులు వెయ్యడం మొదలు పెట్టేడు.

వరలక్ష్మి, సూర్యకాంతం కలిసి:

"గాజులూ పెట్టా రారమ్మా, మా సీతా దేవికి..." అని పాడుతున్నారు. నాకూ వచ్చు ఆపాట. పాడబోయి మానేశాను. నాకూ గాజులు పెడితే నేనే పాడుకోవడం ఏమిటి?

ఇంతలో వదిన లోపలికి పిలిచింది. హారతి పళ్లెం పట్టుకోమంది. ఇద్దరంవచ్చి ముందు గాజుల మలారానికి, తర్వాత అక్కయ్యకూ హారతి

యిచ్చాం. అప్పటికే అక్కయ్యకు మోచేతుల దాకా గాజులువేసి మల్లయ్య మలారం సర్దుకుంటున్నాడు. నాన్న హారతి పళ్లెంలో పది రూపాయలు వేశాడు. మల్లయ్యకు తాంబూలం ఇమ్మన్నాడు అక్కయ్యని. అందులో రూపాయలుకూడా వుంచేడు. ఎన్నున్నాయో సరిగ్గా కనబడలేదు నాకు. అక్కయ్య మల్లయ్యకు తాంబూలం ఇచ్చి మలారం కళ్ల కద్దుకుంది

వదినా నేనూ తాంబూలాలు, వాయినాలు ఇవ్వడం మొదలుపెట్టేం పేరంటాళ్ళకి. ఓ వరస నించి ఇచ్చుకుని వస్తున్నాం. మా అత్తయ్య పన్నీరు చల్లుతూ గంధం రాస్తోంది. నాన్న వీధులో కూర్చున్నాడు అరుగుమీద. తాంబూలం పుచ్చుకున్న పేరంటాళ్లు, అక్కయ్యమీద అక్షింతలు చల్లి వెళ్ళిపోతున్నారు. వీధిలో అడుగు పెట్టగానే బిగ్గరగా మాటలు చెప్పుకుంటున్నారు. క్రమంగా మాసావిడి అంతా ఖాళీ అయిపోయింది. అక్కయ్య లేచి గదిలోకి వెళ్లింది. అన్నయ్య జంబుఖానాలు మడుస్తున్నాడు. నాన్న లోపలికి వచ్చేడు. ఎందుకో కోపంగా వున్నాడు. తిన్నగా మా అమ్మమ్మ దగ్గిరికివచ్చి "నా మొహాం భూమిలో పాతేశావీవేళ—నా గౌరవమంతా గంగపాలయిపోయింది" అన్నాడు. వదినా నేనూ భయపడ్డాం.

"ఏమిటోయ్ నువ్వనేది నాకు బోధపడలేదు" అంది అమ్మమ్మ.

"ఇంకేముంది? ప్రథమ తాంబూలం విశాలాక్షమ్మకివ్వలేదట. ఈవూరి రివాజు అది. దానికి వ్యతిరేకంగా జరిగిందీనాడు. ఆవిడముఖం ముడుచుకుంటూ పోయింది. ఆమె ప్రక్కనున్న వాళ్లప్పుడే మొదలు పెట్టారు నే వినాలని" అన్నాడు నాన్న.

"అయ్యో - అల్లాగా" అంది అమ్మమ్మ బుగ్గలు నొక్కుకుంటూ. వదిన వంటింట్లో కూర్చుని ఏడుస్తూంది. అక్కయ్య ఈ మాటలు విని తొంగిచూసి మళ్లీ గదిలోకి వెళ్లిపోయింది. నేపోయి వదిన ప్రక్కనే కూర్చున్నాను విచారంతోటి. రెండు నిముషాల తర్వాత అన్నయ్య వంటింట్లోకి వచ్చి "అలా ఏడుస్తావెందుకు పైగా, తప్పు చేసి" అన్నాడు గట్టిగా -

"నేను బ్రతికి వుండడమే తప్పు" అంది వదిన ఎర్రబడ్డ కళ్ళతో చూస్తూ.

"నీ తప్పుకాదు - నా తప్పు - నే బ్రతికి వుండడం" అంటూ అన్నయ్య తలమీద చేతులతో మొత్తుకున్నాడు. అమ్మమ్మ అడ్డంవచ్చింది. అన్నయ్యకోపం చల్లారలేదు. "నే నీ యింట్లో వుండలేను. నే వెళ్ళిపోతున్నాను. తిరిగిరాను" అంటూ గబగబా వెళ్ళిపోయేడు. అప్పటికే చీకటి పడుతోంది. పోవడం సరాసరి కాలవకేసి పరుగెత్తేడు. అమ్మమ్మ నాన్నకోసం వూళ్లోకి పరుగెత్తింది. నాన్న వస్తూనే "ఇదంతా నా కర్మ" అని మొత్తుకున్నాడు. వీళ్ళందర్నీ చూడలేక గదిలోకిపోతే అక్కయ్య మంచంమీద పడుకుని వెక్కి వెక్కి యేడుస్తోంది.

నాన్న లాంతరు తీసుకుని కాలవగట్టుకు పరుగెత్తాడు. పది నిమిషాల్లో అన్నయ్యని తీసుకు వచ్చేడు. వాళ్లు ఒకళ్ళతో ఒకళ్లు మాట్లాడుకోడం లేదు. అన్నయ్య వెళ్లి పెరట్లోకూర్చున్నాడు. నాన్న వీధి అరుగుమీద కూర్చుని ముక్కూ,కళ్లూ ఒత్తుకుంటున్నాడు తువ్వాలతో. అమ్మమ్మ సావిట్లో ఓమూల కూర్చుని "ఇదంతా నా బిడ్డలేని లోపం. నా తల్లివుంటే ఈ అవకతవకలు జరుగునా" అని గొణుగుతూంది. వదిన వంటింట్లో యేడుస్తూంది. నే నేమీ తోచక గుమ్మంలో కూలబడ్డాను. మా అందర్నీ చూసి మా సావిడి దీపం సన్నగా దిగజారుతోంది.

ఇంతలో ఏదో బండివచ్చి మా గుమ్మంలో ఆగింది. ఆ చీకటిలో బూట్లచప్పుడు... నాన్న 'ఇదే రావడమా' అంటున్నాడు. మా బావ వచ్చేడు. సరాసరి అక్కయ్య గదిలోకి వెళ్ళి 'రెండు రూపాయలివ్వు' అన్నాడు. అక్కయ్య పెట్టెతీసి యిచ్చింది. సామాను చూసుకుని బావ డబ్బుయిస్తే బండివాడు 'సలాం' చేసి వెళ్ళిపోయేడు. బావ కుర్చీలో కూర్చుని జోళ్లు విప్పుతూంటే అమ్మమ్మ అడిగింది: 'అంతా క్షేమమేనా! నాయనా' అని. 'ఓ' అన్నాడు బావ. 'లేవండి బావగారూ! మడిగట్టుకోండి' అన్నాడు అన్నయ్య వచ్చి.

బావ గదిలో పట్టుపంచ కట్టుకుంటూ అక్కయ్యని అడుగుతున్నాడు "అలాగున్నావేం" అని.

"ఔనుగాని, పొద్దున్న వస్తానని ఇదేనా రావడం" అంది అక్కయ్య.

"పని తెమల లేదు. అంతమాత్రానికే బెంగ పెట్టుకొని ఏడవాలా నాకోసం" అన్నాడు బావ.

అందరం భోజనాలు చేస్తున్నాం. వదిన వడ్డిస్తోంది. నాన్నా, బావా, అన్నయ్యా కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. బావ వదినకేసి చూసి "ఈ కార్యానికి మా చెల్లాయి బాగా కష్టపడి వుంటుంది. పాపం! ఎలా చిక్కిపోయిందో" అన్నాడు. ఇంతలో అన్నయ్య అందుకుని "ఏ కష్టమూ లేదు. ఎవరింట్లో కార్యాలకు వాళ్లు చేసుకోకపోతే ఎలాగ?" అన్నాడు.

అమ్మమ్మ అడ్డంవచ్చి "అదేమిటయ్యా! 'ఆడదానికి కడుప్పట్టినంత తిండీ, వళ్లుపట్టినంత చాకిరీ' అని పెద్దలే రాసేరుగదా" అంది నవ్వుతూ. బావ కూడా నవ్వుతూ "అమ్మమ్మగారు సామెతలు లేకుండా మాట్లాడరు" అన్నాడు.

భోజనా లయ్యేటప్పటికి పది గంటలయింది. బావ నాదగ్గిరికి వచ్చి "ఏమే! నీ గాజులు చూపెట్టేవు కాదేం నాకు" అన్నాడు.

"రేపు చూద్దువుగానిలే పడుకో" అన్నాను. బావ నా బుగ్గమీద గిల్లి వెళ్ళిపోయేడు గదిలోకి.

* * *

మర్నాడు పొద్దున్న మా బావా, అన్నయ్యా, నేనూ సావిట్లో కాఫీ తాగుతున్నాం. మా బావ అందుకుని "ఈ ఇల్లు ఇప్పుడు బాగుంది. ఇదివరకెప్పుడు చూసినా ఈ గోడలు బూజు పట్టి వుండేవి" అన్నాడు.

మా అన్నయ్య నవ్వి, "అవును. మా చెల్లెలి గాజుల ధర్మమా అంటూ మా యింట్లో బూజంతా దులిపేసేము. ఇకముందు శుభ్రంగా వుంచదలుచుకున్నాము" అన్నాడు.

"అన్నయ్యా! నీ మాటల్లో అర్థం నాకు తెలిసిందిలే" అంటూంటే, 'ఇలారావే" అంటూ మా అక్కయ్య నన్ను గదిలోకి పిలిచింది.



తయారుచేయువారు
ది మైసూర్ వెజిటబిల్ ఆయిల్ ప్రాడక్ట్స్ లిమిటెడ్, మద్రాసు